కారవార నౌకాయానం సమీపంలో పేలిన సిలిండర్

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా కారవారలోని ముదగ నౌకాయాన కేంద్రం వద్ద ఉన్న లేబర్‌కాలనీలో ఆదివారం వంటగ్యాస్ సిలిండర్ పేలింది. కార్మికులు నివసించే షెడ్‌లో సిలిండర్ పేలడంతో అనుబంధంగా ఉండే పలు షెడ్లు కాలిపోయాయి. ఆ సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెనుముప్పు తప్పింది. ఎన్‌సీసీ కాంట్రాక్టు సంస్థకు చెందిన 150 మందికిపైగా కార్మికులు షెడ్లలో నివసిస్తారు. ఉదయం సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. సుమారు నాలుగైదు షెడ్లకు అగ్ని రాజుకుంది. కొంతమందికి స్వల్పగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

పీఎం విశ్వకర్మ పథకాల రిజిస్ట్రేషన్‌లో

బెళగావిలో అత్యధికం

18 వర్గాల చేతివృత్తిదారులకు రుణసదుపాయం

రాష్ట్రమే టాప్..!



సీఎం సిద్దరామయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పుట్టణ్ణ, కుటుంబికులు

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి)

సంప్రదాయ చేతివృత్తుల ద్వారా జీవనాలు సాగించే 18 వర్గాల వారికి సహాయధనం అందించే విశ్వకర్మ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిలో దేశంలోనే కర్ణాటక వాసులు అత్యధికంగా నిలిచారు. రాష్ట్రస్థాయిలో బెళగావి జిల్లా ప్రథమస్థానంలో ఉంది. ఈనెల 4వ తేదీ వరకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 24,06,255 మంది పీఎం విశ్వకర్మ పథకం ద్వారా సాయం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. బెళగావి జిల్లాలో 2,24,630 మంది కాగా తుమకూరులో 1,69,366 మంది, బెంగళూరు నగర పరిధిలో 1,63,662 మంది ఉన్నారు. ఆ తర్వాత స్థానాలలో బీదర్, మైసూరు, ధారవాడ, చిత్రదుర్గ, బళ్లారిలలోనూ లక్షమందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. కొడగులో 4,335మంది అత్యల్పంగా దరఖాస్తు చేసుకుని 31వ స్థానంలో నిలిచింది. ఉడుపిలో 10,954, దక్షిణకన్నడ 16198, చిక్కమగళూరు 23474, యాదగిరిలో 28258, రామనగరలో 30353, ఉత్తరకన్నడ 32182 మంది ఉన్నారు.





అర్హులు ఎవరంటే...

చేతివృత్తిదారులైన వడ్రంగి, బోట్ల తయారీ, ఆయుధాలు, తాళాల తయారీ, కొలిమిపని, సుత్తితో సామగ్రి తయారీ, ఆభరణాల తయారీ, శిల్పాలు, విగ్రహాల తయారీ, రాళ్లతో శిల్పాలు చెక్కేవారు, కుమ్మరి, చర్మకారులు, పాదరక్షల తయారీ, ఇంటి నిర్మాణం, బుట్టల అల్లకం, చాపల అల్లకం, కళంకారి పనులు, బొమ్మల తయారీదారులు, నాయీ బ్రాహ్మణులు, కొబ్బరినారతో బొమ్మలు, హారాల తయారీ, రజకులు, టైలర్లు, చేపలు పట్టే వలల తయారీ దారులకు ఆర్థికసాయం అందుతుంది. 18 రకాల చేతివృత్తులదారులకు పీఎం విశ్వకర్మ పథకం వర్తిస్తుంది. జిల్లాస్థాయిలో అధికారులు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తించనుంది. శిక్షణతోపాటు 500 రూపాయల గౌరవ వేతనం లభిస్తుంది. తొలి విడత శిక్షణ పొందాక లక్ష రూపాయలు, రెండో విడత శిక్షణల తర్వాత రూ.2లక్షలు ఇవ్వనున్నారు. వీరికి ఎటువంటి గ్యారెంటీలు లేకుండానే రాయితీ రుణం దక్కుతుంది.





రెండు నెలల్లో 50 శాతం నమోదు

పార్లమెంటు సభ్యుల జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ, ఇన్‌చార్జ్, సమితి సభ, బ్యాంకుల ప్రగతి పరిశీలనా సమావేశాలు, లీడ్ బ్యాంక్ నేతృత్వంలో జరిగే సభల్లోనూ విశ్వకర్మ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చైతన్యం కలిగించారు. ఇలా రెండు నెలల వ్యవధిలోనే 50 శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు ఎనిమిదేళ్ల కోసం రూ.13వేల కోట్లు కేటాయించారు. దేశవ్యాప్తంగా 2023-24లో 6లక్షల మంది, 2024-25లో 18లక్షల మంది, 2025-26లో 5 లక్షల మంది, 2026-27లో 50వేల మంది, 2027-28లో 50వేల మంది చొప్పున 30లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించదలిచారు. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాన్ని ప్రకటించారు. పీఎం విశ్వకర్మ యోజనను 2023 సెప్టెంబరు 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా లాంఛనంగా ప్రారంభించారు. చేతివృత్తిదారులలో నైపుణ్యత పెంపొందించడంతోపాటు మారుతున్న సాంకేతిక విధానాలకు అనుగుణంగా అవసరమైన యంత్రాల కొనుగోలుతోపాటు ఉత్పత్తులను జాతీయస్థాయినుంచి అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లడమే పీఎం విశ్వకర్మ పథకం ప్రధాన ఉద్దేశ్యం. రాష్ట్రవ్యాప్తంగా పథకానికి నమోదు చేసుకునేవారి సంఖ్య ఎక్కువగానే ఉన్నా సర్వర్ సమస్య వెంటాడుతోంది. పార్లమెంటు సభ్యులు, అధికారులు సర్వర్ సమస్యను పరిష్కరించాలని ఒత్తిడి తెస్తున్నా సాధ్యం కావడం లేదు. ఒక్కో దరఖాస్తు అరగంటకుపైగా సమయం తీసుకుంటోంది. నమోదు ప్రక్రియ సరళీకృతమైతే మరింతమంది ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

దేవెగౌడది ద్వంద్వ నీతి

- ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తా
- ఎమ్మెల్సీ పుట్టణ్ణ సన్మాన సభలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడది ద్వంద్వ నీతి అని, నరేంద్ర మోదీ ప్రధాని అయితే దేశం విడిచి వెళ్తానని వ్యాఖ్యానించారని ఇప్పుడే అదే బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. ఆదివారం కెంగేరిలోని సూలికెరె మైదానంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన పుట్టణ్ణ ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల కృతజ్ఞతా సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీతో తనది జన్మజన్మల అనుబంధమని దేవెగౌడ వ్యాఖ్యానించారని తెలిపారు. వచ్చే జన్మలో ముస్లింగా పుడతానని, బీజేపీ తనకు వ్యతిరేకమని చెప్పారని ఇప్పుడు జేడీఎస్ పార్టీ మనుగడ కోసం చేతులు కలిపారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు జేడీఎస్ విధానాన్ని గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారన్నారు. గతంలో జేడీఎస్‌లో పుట్టణ్ణ ఉన్నప్పుడు ఉపాధ్యాయులు ఆయనపట్ల విశ్వాసంగా ఉన్నారని గుర్తించానన్నారు. వరుసగా ఐదు సార్లు ఆయన గెలుపొందారంటే ఉపాధ్యాయుల సమస్యలపట్ల ఆయనకున్న చిత్తశుద్ధే కారణం అన్నారు. జేడీఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లారని, అక్కడి నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినా ఉపాధ్యాయులు మాత్రం ఆయనకు ఆశీస్సులు అందించారని కొనియాడారు. పుట్టణ్ణ విజయం ఉపాధ్యాయుల విజయమని తెలిపారు. బెంగళూరు గ్రామీణ నుంచి డీకే సురేశ్ మరోసారి గెలుస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు నరేంద్రమోదీ పేరిట ప్రచారం చేస్తున్నారని, అది వారి మూర్ఖత్వమన్నారు. రాహుల్ పాదయాత్ర చేసినందుకు గత ఎన్నికల్లో 136 స్థానాలు గెలిచామని, మోదీ బహిరంగసభలు, రోడ్‌షో చేసిన ప్రతిచోటా బీజేపీ ఓడిందన్నారు. రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 2023-24లో రాష్ట్రం నుంచి రూ. 4.30 లక్షల కోట్లు పన్నులు కేంద్రానికి చేరితే, జీఎస్టీ వాటా రూ. 50,257 కోట్లు మాత్రమే వాపసు వచ్చిందన్నారు. ప్రజలు అన్యాయాన్ని గమనిస్తున్నారని, అయినా 28 స్థానాల్లో గెలుస్తామని బీజేపీ వారు గొప్పలు పోతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఆర్థికశాఖ ముఖ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు చెలువరాయస్వామి, రామలింగారెడ్డి, బెంగళూరు గ్రామీణ లోకసభ అభ్యర్థి డీకే సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ రన్‌కు పచ్చజెండా చూపుతున్న సీఎం సిద్దరామయ్య

ఉత్సాహంగా 'పోలీస్ రన్'

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసుశాఖ ఆధ్వర్యంలో సువర్ణ మహోత్సవాన్ని పురస్కరించుకుని విధానసౌధ వద్ద ఆదివారం ఏర్పాటైన పోలీస్ రన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య పచ్చజెండా చూపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ యువతే దేశ సంపద అన్నారు. వారు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ప్రభుత్వం చేపడుతున్న జాగృతి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలన్నారు. మాదకద్రవ్యాల వ్యసనంతో ఆర్థికంగాను, సామాజికంగాను పతనమవుతారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. బెంగళూరు నగరంలో పచ్చదనం తగ్గిపోతోందని తిరిగి పెంపొందించాలనే ఉద్దేశ్యంతోనూ, యువకులు ఆరోగ్య జీవనం సాగించాలని కోరుతూ పోలీస్ రన్ నిర్వహించినట్టు తెలిపారు. కాగా ఇటీవలి కాలంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సైబర్ నేరాలు పెరిగాయని, చైతన్యంతోనే వీటి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రన్‌లో వేల సంఖ్యలో పోలీసు సిబ్బంది భాగస్వామ్యులయ్యారు. ఈ దిశగా పోలీసుశాఖ పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శులు కే గోవిందరాజు, నసీర్ అహ్మద్, సీఎం వ్యక్తిగత కార్యదర్శి ఎలికే అతీక్, డీజీపీ అలోక్‌మోహన్, పోలీసు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

రూ.100 కోట్లతో చెరువుల అభివృద్ధి

- మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చింతామణి, మార్చి 10


చింతామణి నియోజకవర్గంలో తాగునీటి కోసం రూ.100 కోట్లతో చెరువుల అభివృద్ధి పనులు చేపడతామని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. భూగర్భజలాల మట్టాన్ని, చెరువుల సామర్థ్యం పెంచేందుకు డీసీబీ బ్యాంకు, వెల్ ల్యాబ్స్, ఇండియా కేర్స్ ఫౌండేషన్, విమోస్ టెక్నో ప్రైవేట్ లిమిటెడ్ నుంచి చింతామణి పట్టణానికి అనుబంధంగా ఉండే మాళపల్లి చెరువు ఆధునీకీకరణకు రూ.46లక్షలతో చేపట్టే పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఎం కృష్ణ ముఖ్యమంత్రిగా ఉన్నవేళ జలసంవర్ధనె పథకం కింద చెరువుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. చెరువులలో పూడిక తీత, చెరువుల విస్తీర్ణం పెంపు, వరల్డ్‌బ్యాంకు సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఈ ప్రాంతంలో బోరుబావుల ఆధారంగానే వ్యవసాయం సాగుతోందన్నారు. చెరువులలో నీరు తగినంత ఉంటేనే బోర్లలో నీటిమట్టం పెరుగుతుందన్నారు. ప్రభుత్వానికి స్వచ్ఛంద సేవా సంస్థలు, బ్యాంకులు, పరిశ్రమలు, తదితరులు సీఎస్ఆర్ గ్రాంటు ద్వారా ముందుకు వస్తే మరింత అభివృద్ధి పనులు చేయనున్నట్టు తెలిపారు. నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి, ఇండియాకేర్స్ వయోమాస్ ఫౌండేషన్ సీఈఓ మీనా, వెల్ ల్యాబ్స్ పరిశోధకులు, ఫ్రెండ్స్ ఆఫ్ నెక్స్ సహసంస్థాపకులు రామప్రసాద్, మేలుకోటె మంజునాథ్, కేఆర్‌పుర డీసీబీ బ్యాంకు మేనేజర్ విష్ణు పాలేపల్లి తదితరులు పాల్గొన్నారు.

హుబ్బళ్లి విమానాశ్రయానికి రెండో టెర్మినల్

రూ. 340 కోట్లతో నిర్మాణాలకు వర్చువల్‌గా ప్రధాని శ్రీకారం

హాజరైన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 15 విమానాశ్రయాల్లో కొత్త టెర్మినల్‌ల నిర్మాణాలకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ రూపంలో ఆదివారం శ్రీకారం చుట్టారు. రాష్ట్ర పరిధిలోని హుబ్బళ్లి విమానాశ్రయంలో రెండో టెర్మినల్‌ను రూ.340కోట్లతో చేపట్టనున్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి హుబ్బళ్లిలో జరిగిన కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. ప్రధాని వర్చువల్ రూపంలో ఆవిష్కరించాక స్థానికంగా మంత్రి బహిరంగసభలో మాట్లాడారు. హుబ్బళ్లి-ధారవాడ జంట నగరాలకు రవాణా సదుపాయం సరళీకృతం చేసే దిశగా విమానాశ్రయం ఏర్పాటయిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌలభ్యాలు ఉండాలనే రూ.340 కోట్లతో రెండో టెర్మినల్‌ను నిర్మించనున్నట్టు తెలిపారు. రెండేళ్లలో టెర్మినల్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. దీంతో 4-10 విమానాల పార్కింగ్‌కు, రోజూ 2,400 మంది ప్రయాణికులకు అనుకూలమవుతుందన్నారు. ఇప్పటికే రైల్వే, రోడ్డు మార్గాలు గణనీయంగా అభివృద్ధి చెందాయని, విమానాశ్రయం ద్వారా జంటనగరాలకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరవింద బెల్లద్, మహేశ్ టెంగినకాయ్, ఎంఆర్ పాటిల్, ప్రసాద్ అబ్బయ్య, మేయర్ వీణా భరద్వాజ్ పాల్గొన్నారు.



అందరిచూపు ఢిల్లీవైపే

తొలిజాబితాలో రాష్ట్ర బీజేపీ నేతలకు దక్కని చోటు

రెండో జాబితా కోసం కాంగ్రెస్ నేతల ఎదురుచూపు

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ మరికొన్ని రోజుల్లోనే వెలువడనున్న తరుణంలో అభ్యర్థులు ఎవరనే ఉత్కంఠ పెరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలూ తొలిజాబితాలను విడుదల చేశాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి సంబంధించి ఏడుగురు అభ్యర్థులను ప్రకటించింది. బీజేపీ తొలి జాబితాలో ఒక పేరు కూడా లేదు. దీంతో అందరి దృష్టి రెండో జాబితాపైనే ఉంది. అభ్యర్థుల ఖరారు కోసం పార్టీ అగ్రనేతలు ఢిల్లీలో కసరత్తు చేస్తున్నారు. రెండు మూడు రోజులపాటు ఢిల్లీలో గడిపి వెనుతిరిగి వచ్చిన యడియూరప్ప మరోసారి శనివారం వెళ్లాల్సి ఉన్నా అనూహ్యంగా వాయిదాపడింది. దీన్నిబట్టి ఒకటి రెండు రోజుల్లోనే మరోసారి ఢిల్లీకి వెళ్లే పరిస్థితి రావచ్చు. కాంగ్రెస్‌కు సంబంధించి 15 నియోజకవర్గాలకు ఒకే పేరుతో సిఫారసు వెళ్లినట్టు తెలుస్తోంది. వీరిలో ఏడుగురి పేర్లు ఖరారు కాగా 8మందిపేర్లు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ రెండో జాబితాలో కనీసం 10-15 మంది అభ్యర్థుల పేర్లు ఖరారయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీ రెండో జాబితాలోనే క్రియాశీలక నియోజకవర్గాలకు పేర్లు వెలువడనున్నాయి. చిక్కమగళూరు సిట్టింగ్ ఎంపీ, కేంద్రమంత్రి శోభాకరంద్లాజెపై మరోసారి పార్టీ కార్యకర్తలు విరుచుకుపడ్డారు. శోభా గోబ్యాక్ అంటూ ఆదివారం నినాదాలు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పార్టీ సీనియర్ నేత, క్రియాశీలక రాజకీయాలు గుడ్‌బై చెప్పిన ఈశ్వరప్ప కుమారుడు కాంతరాజ్‌కు టికెట్ విషయమై పార్టీ అగ్రనేత యడియూరప్ప స్పందించారు. కాంతరాజ్‌కు టికెట్ వచ్చేందుకు తనవంతు కృషిచేస్తానని చెప్పారు. చిక్కబళ్లాపుర నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్ తీవ్ర ప్రయత్నం చేస్తుండగా ఆయనను ఢీ కొట్టేలా యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ కుమారుడు అలోక్ విశ్వనాథ్ తెరపైకి వచ్చారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలతో సంబంధాలు కల్గిన విశ్వనాథ్ పలువురు ప్రముఖుల ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఏపీ అభివృద్ధికోసం సొంతూళ్లకు వెళ్లి ఓటేద్దాం

గురజాల ఆత్మీయసభలో ప్రముఖులు




చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్ ఆత్మీయ సభలో ప్రవాసాంధ్రులు

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా వెనుకబడిపోయిందని, అభివృద్ధి కోసం సొంతూళ్లకు వెళ్లి ఓటు వేద్దామని ప్రవాసాంధ్ర ప్రముఖులు పిలుపునిచ్చారు. ఆదివారం ఉత్తరహళ్లిలో చిత్తూరు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్ మోహన్ ఆత్మీయసభ నిర్వహించారు. పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎంఆర్ దొరస్వామి ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరయ్యారు. కమ్మసంఘం మాజీ అధ్యక్షుడు కృష్ణమనాయుడు అధ్యక్షత వహించగా కమ్మసంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యనాయుడు, ప్రసాద్‌బాబు, ఆర్‌వీ హరీశ్, మాజీ కార్పొరేటర్ వెంకటస్వామి నాయుడు, శ్రీకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రుక్మాంగదనాయుడు, రాజేంద్రనాయుడు ముఖ్యులుగా పాల్గొన్నారు. సమావేశంలో గురజాల జగన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు యువతను ప్రోత్సహించే దిశగా చిత్తూరు టిక్కెట్‌ను తనకు కేటాయించారని తెలిపారు. గత ఐదేళ్లుగా చిత్తూరు అంటేనే దౌర్జన్యాలకు మారుపేరు మారిందని, అక్కడ పోటీకి సత్తా కల్గిన వ్యక్తి అనే తనను ఎంపిక చేశారని అన్నారు. బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఏపీ సీఎం జగన్ కుట్ర పన్ని చంద్రబాబునాయుడిని అరెస్టు చేయించారని, అంతకుముందు శాసనసభలో కించపరిచారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగానే సభలోకి అడుగు పెడతానని సవాల్ చేశారన్నారు. అదే రోజున తన తండ్రి, చంద్రబాబుతోపాటు నువ్వుకూడా శాసనసభకు వెళ్లాలని సూచించారన్నారు. అందుకోసమే చిత్తూరు రాజకీయాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యానని అన్నారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీతో పొత్తు మరింత కలసి వచ్చిందన్నారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు చిత్తూరులో ఎర్రచందనం పెంచేందుకు ప్రోత్సహించారని, వైసీపీ అధికారంలో వాటిని ఎగుమతి చేయడమే వ్యాపారంగా చేసుకున్నారన్నారు. సొంతూళ్లకు పోలింగ్‌కు నాలుగురోజులు ముందే వచ్చి ఒక్కొక్కరు 50మందితో ఓటు వేయించాలని ఆయన వేడుకున్నారు. దొరస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన గురించి చెప్పాల్సిన పనిలేదన్నారు. చంద్రబాబును కుట్ర పన్ని అరెస్టు చేసినా ప్రపంచవ్యాప్తంగా ఆయనకు లభించిన మద్దతు, ఆదరణ మరువలేనిదన్నారు. రోజుల తరబడి బెంగళూరు, హైదరాబాద్, అమెరికా అనే తేడా లేకుండా ఆందోళన చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ఎందుకు అవసరమో... ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులు గుర్తించారన్నారు. ఇక మనవంతే మిగిలిందన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే విశ్వవిద్యాలయాలు, ఐఐటీ, ఎన్ఐటీ వంటి సంస్థలు ఉండాలన్నారు. ఒకప్పుడు వంద బస్సుల్లో బెంగళూరు నుంచి చిత్తూరు వెళ్లి ఓట్లు వేశారని, రానున్న ఎన్నికల్లో వెయ్యి బస్సులతో వెళ్లి తెలుగుదేశం అభ్యర్థులను గెలిపిద్దామన్నారు. శ్రీకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రుక్మాంగద నాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత బుద్ధిమంతుల జాబితాను రూపొందించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం చంద్రబాబును గుర్తించిందన్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌ను ఒక విజన్‌తో అభివృద్ధి చేశారన్నారు. ఇటీవల ఐదేళ్లలో రాజధాని లేదు, పోలవరం పూర్తి కాలేదు, పల్లె నుంచి పట్టణం దాకా ప్రతిచోట్లా విధ్వంసమే సాగుతోందన్నారు. మాజీ కార్పొరేటర్ వెంకటస్వామినాయుడు, కబడ్డీ బాబు, ఆర్‌వీ హరీశ్ సహా లీలా శంకర్రావులు ప్రసంగించారు. సమావేశంలో లోకనాథనాయుడు, యోగమూర్తి, రిటైర్డు ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం నాయుడు, శరత్‌బాబు, అయ్యప్ప, రాజా, శివకుమార్ నాయుడు, బుజ్జినాయుడు, జగ, సూర్యనాయుడుతోపాటు ప్రముఖులు పాల్గొన్నారు. ఇట్టిమడు, బనశంకరి, హనుమంతనగర్, గిరినగర్‌తో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చిత్తూరు ప్రాంత ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.



హాజరైన జనం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.83	1,600.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,169	8,735
సామర్థ్యం (టీఎంసీలు)	7.21	22.26

సిరుగుప్పలో అన్నదానం



అన్నదానం చేస్తున్న మల్లికార్జున తదితరులు

సిరుగుప్ప, మార్చి 10 : శివరాత్రి అమావాస్యను పురస్కరించుకుని బస్టాండు ఎదురుగా వున్న ఈశ్వరాలయంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. సిరుగుప్ప పట్టణంలో ఆదివారం ఆకుకూరల వ్యాపారి మల్లికార్జున ఆధ్వర్యంలో ఈ అన్నదాన సేవా కార్యక్రమాలు చేపట్టారు. సుమారు ఐదేళ్లుగా ఆయన అమావాస్య రోజున అన్నదాన సేవాకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తాలుకాకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

నేడు కమ్మసంఘం ఆధ్వర్యంలో సన్మానాలు

బళ్లారి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బళ్లారి కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం కమ్మసమాజానికి చెంది వివిధ హోదాల్లో ఉన్న వారిని సన్మానిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం కమ్మభవనం వద్ద సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. బుడా అధ్యక్షుడు జే.ఎస్ ఆంజనేయులు, కర్ణాటక స్టేట్ న్యాయవాదుల బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కే. కోటేశ్వరరావు, గవర్నమెంట్ ప్లీడర్ వి. జనార్దన్, న్యాయవాది సుధాకర్, మాజీ మేయర్, కార్పొరేటర్ రాజేశ్వరి సుబ్బరాయుడు, ఎం. పద్మవివేక్, ముల్లంగి నందీష్ బాబు, ముండ్లూరు ప్రభంజన్ కుమార్, రామాంజనేయులు, కోనంకి తిలక్, ప్యారం వివేక్‌ను సన్మానిస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ



పరికరాలను రైతుకు అందజేస్తున్న అధికారులు

సిరుగుప్ప, మార్చి 10 : వ్యవసాయ భాగ్యం పథకం కింద 50 శాతం సబ్సిడీతో విత్తనాల టిల్లర్లను వ్యవసాయాధికారి పురుషోత్తమ పంపిణీ చేశారు. ఆదివారం సిరుగుప్ప పట్టణంలో రారావికి చెందిన రైతు యోగానంద్‌కు ఈ పరికరాలను అందజేశారు. వీటితో పాటు పంపులు, మడకలు, వివిధ పరికరాలను కూడా అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తులు సమర్పించిన రైతులు తక్షణమే వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించి పరికరాలు పొందాలని కోరారు.

రోడ్డుకు హేమాద్రి భట్టు పేరు పెట్టాలి



హేమాద్రిభట్టు కుటుంబీకులను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హేమాద్రిభట్టు నేటి సమాజాన్ని తీర్చిదిద్దిన మహానుభావుడు.అందుచేత అయ పేరును బాలభారతి రోడ్డుకు పెట్టాలని, మాజీ ఎమ్మెల్యే ప్రముఖ పారిశ్రామిక వేత్త నారా సూర్యనారాయణరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం బాలభారతి పాఠశాలలో అసరే ట్రస్టు ఆధ్వర్యంలో హేమాద్రి భట్టు సంస్మరణ సభను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బళ్లారి మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, కళ్యాణ స్వామీ గురుజీ ముఖ్య అతిదులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ హేమాద్రిభట్టు ఉపాధ్యాయులకు గౌరవం తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు కష్టాలు రాకుండా పెంచడం కన్నా కష్టం విలువ తెలిసేలా పెంచాలని అప్పుడే ఎన్ని కష్టాలు వచ్చినా సమాజంలో ఎదుర్కొని జీవిస్తారన్నారు. అనంతరం హేమాద్రిభట్టు కుటుంబీకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసరే ట్రస్టుకు చెందిన గురురాజ్, గౌరీప్రసాద్, జయతీర్థ, శరణబసవ, హేమాద్రిభట్ సతీమణి సావిత్రభట్ కూతురు మీరాభట్, కోడల్లు డాక్టర్ కృష్ణా, అశోక్, స్నేహ పాల్గొన్నారు.

మేయర్ రేసులో బావాబామ్మర్ది..!



ప్రభంజన్ కుమార్

- మేయర్, ఉప మేయర్ ఎంపికకు నోటిఫికేషన్ జారీ..
- ఈనెల 28న మేయర్ ఎన్నిక
- ముల్లంగి నందీష్ బాబు, ముండ్లూరు ప్రభంజన్ కుమార్ మధ్య పోటీ
- ఆసక్తికరంగా మారిన బళ్లారి రాజకీయం



నందీష్ బాబు

బళ్లారి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బళ్లారి మేయర్ రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఇందుకోసం బావ., బావమరుదులు అయిన ముండ్లూరు ప్రభంజన్ కుమార్, ముల్లంగి నందీష్ బాబు పోటీ పడుతున్నారు. 23వ మేయర్, ఉపమేయర్ ఎన్నికకు కర్ణాటక రాష్ట్ర నగరాభివృద్ధి సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 28న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

కర్ణాటకలో ముండ్లూరు ఫ్యామిలీ అంటే రాజకీయంగానూ. సామాజికంగానూ చాలా ఫేమస్, ముండ్లూరు రామప్ప బళ్లారిలో సుమారు మూడు సార్లు ఎమ్మెల్యే గాను, రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. బళ్లారిలో ఏకంగా 35 ఏళ్ల పాటు రాజకీయంగా ఎదురులేని కుటుంబంగా పేరు తెచ్చుకున్నారు. ఆ కుటుంబం నుంచి వచ్చినవ్యక్తే ప్రభంజన్. బళ్లారి కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ముండ్లూరు ప్రభంజన్‌కు కాంగ్రెస్ పార్టీలో బి-పారం ఇవ్వలేదు, దీంతో ఆయన ఇండిపెండెంట్‌గా గెలిచి కాంగ్రెస్‌లోనే కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. ముండ్లూరు ఫ్యామిలీ నుండి ప్రభంజన్ మేయర్ కావాలని రాజకీయంగా పావులు కదుపుతున్నారు. ముండ్లూరు ప్రభంజన్‌కు ప్రస్తుత ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మద్దతు ఉందని ఆయన సన్నిహితులు బహిరంగంగా అంటున్నారు.

ఇక ముల్లంగి నందీష్‌బాబు ఆయనకు వరసకు బావ అవుతారు. ఇద్దరూ కమ్మసామాజిక వర్గం నుంచి పోటీ పడుతున్నారే. ముల్లంగి రవింద్రబాబుకు రాజకీయంగా బాగా గుర్తింపు ఉంది. గతంలో ఆయన బుడా అధ్యక్షుడుగా కూడా పనిచేశారు. ముల్లంగి రవింద్రబాబు కుమారుడే ముల్లంగి నందీష్ బాబు. గతంలో గాలి సోమశేఖర్‌రెడ్డి కుమారుడిపై పోటీ చేసి నందీష్ బాబు గెలిచారు.

నందీష్‌బాబుకు గాలి జనార్దన్‌రెడ్డి మద్దతు

ఈ నెల 28న జరిగే మేయర్ ఎన్నికల్లో గాలి జనార్దన్‌రెడ్డి ముల్లంగి నందీష్‌బాబుకు మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ముండ్లూరు ప్రభంజన్‌కు మద్దతు ఇస్తున్నారని తెలుస్తోంది. అదే జరిగితే ఎమ్మెల్యే భరత్‌రెడ్డిని రాజకీయంగా దెబ్బతీయడానికి గాలి జనార్దన్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ఇటీవల విధానసౌధాలో గాలి జనార్దన్‌రెడ్డిపై ఎమ్మెల్యే భరత్‌రెడ్డి చేసిన ప్రసంగం అలాగే బుడా లే-ఔట్ వ్యవహారంలో చెలరేగిన వివాదం ఇందుకు కారణమని తెలుస్తోంది. బళ్లారి నగర ఎమ్మెల్యేకి ఇప్పటికే రాజకీయ ఎదురు దెబ్బలు తగిలాయి. 22వ మేయర్ ఎన్నిక విషయంలోనూ ఎమ్మెల్యే పట్టు కోల్పోయారు. అలాగే బుడా అధ్యక్షుడు ప్రస్తుతం జేఎస్ ఆంజనేయులు నియామకంలోనూ ఎమ్మెల్యే, మంత్రి మాట వినకుండా బుడా అధ్యక్షుడుగా ఆంజనేయులను అధిష్టాన వర్గం ఎంపిక చేసింది. ప్రస్తుతం ఈనెల 28న జరిగే మేయర్ ఎన్నికలో ముండ్లూరు ప్రభంజన్ విజయం సాధిస్తారా..? లేకముల్లంగి నందీష్‌బాబు గెలుస్తారా అనే విషయమై బళ్లారిలో వాడివేడిగా రాజకీయ చర్చలు సాగుతున్నాయి.

రైతులపై నిర్లక్ష్యం తగదు

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసవరాజు

కంప్లి, మార్చి 10: కుడితిని పరిధిలో వుండే హరిగిణదోణి, జానెకుంటిసిద్ధమ్మనహళ్లి, వేణి వీరాపురం, గ్రామాల రైతులు భూములు పోగొట్టుకుని సుమారు 400 రోజులకుపైగా న్యాయపోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు అప్పుడు, ఇప్పుడు అంటూ నిర్లక్ష్యం చేయడం తగదని కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బసవరాజు తెలిపారు. ఈ ఆదివారం వేణి వీరాపురం గ్రామంలో రైతన్నలు, సంఘ సంస్థలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొన్నిరోజుల క్రితమే బెల్గామ్‌లో జరిగిన సమావేశంలో సిద్దరామయ్య నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి రైతులకు జరిగిన అన్యాయంపై ఆరా తీయాలని తెలిపారు. కానీ ఇంతవరకు ఏ అధికారీ ముందుకు రాలేదన్నారు. 14 సంవత్సరాలుగా రైతుల కుటుంబాలు ఫ్యాక్టరీలకు భూములు పోగొట్టుకుని రోడ్డున పడ్డాయన్నారు. భూములను ఫ్యాక్టరీలకు ఇస్తే ఈ భూముల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చి అండగా వుంటుందనుకుంటే ఇంతవరకు రైతులకు న్యాయం చేకూర్చలేదన్నారు. త్వరలోనే భూములు పోగొట్టుకున్న రైతన్నలకు న్యాయం చేయకపోతే భారీ ఎత్తున ప్రతిఘటనలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో సత్తిబాబు, ఆర్‌వీ చంద్రరెడ్డి, నారాయణప్ప, ఆనందప్ప, ధనుంజయ, జగదీష్, బాలప్ప, పోతులింగప్ప, నీలమ్మ, హనుమంతప్ప, వెంకటేష్, చంద్ర కుమారి, జంగ్లి సాబ్, సంపత్, తిమ్మప్ప, తిప్పేస్వామి చెన్నబసయ్య పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి / ఐజీ బీఎస్ లోకేశ్ కుమార్

బళ్లారి సిటీ, మార్చి 10: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ధృడమైన శరీరంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బళ్లారి జోనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బీఎస్ లోకేశ్ కుమార్ పిలుపు నిచ్చారు. రాష్ట్ర పోలీస్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని డా.రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్ ఆవరణ నుంచి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్ణాటక పోలీసు 10కే రన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్ణాటకను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రజలు సహకరించాలన్నారు. తమ పరిసర ప్రాంతాలలో ఎవరైనా డ్రగ్స్ బానిసలుగా గుర్తైతే పోలీసు శాఖకు సమాచారం అందించాలన్నారు. పోలీసు స్వర్ణోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మారథాన్ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాను డ్రగ్స్‌రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లాపోలీస్ శాఖ పంతం పట్టిందని, యువత డ్రగ్స్ బారిన పడకుండా మంచి భవిష్యత్తును రూపొందించుకోవాలని సూచించారు.

జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ రంజిత్ కమార్ బండారు మాట్లాడుతూ గంజాయి, మద్యం, ఇతర డ్రగ్స్‌కు బానిసలు కాకుండా యువత పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా ఆరోగ్యవంతమైన శరీరంపై యువత దృష్టిసారించాలని అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామన్న ప్రతిజ్ఞపై సంతకాల సేకరణ చేశారు. జిల్లాపోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ రేసులో వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు, సరిఫికేట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మహానగరపాలిక సంస్థ కమిషనర్ ఖలీల్ సాబ్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, బళ్లారి నగర డీఎస్పీ చంద్రకాంత నందరెడ్డి, తోరణగల్లు డివిజన్ డీఎస్పీ ప్రసాద్ గోఖలే, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జెండాఊపి మారథాన్‌ను ప్రారంభిస్తున్న లోకేశ్‌కుమార్

ఆలయాల్లో అమావాస్య పూజలు

కంప్లి, మార్చి 10 : ఆదివారం అమావాస్య రావడంతో ఆలయాల్లో భక్తాదులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు రద్దీగానే వున్నాయి. ఈ సందర్భంగా విజయనగర జిల్లా కొట్టూరు బసవేశ్వరస్వామికి ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. అలాగే ఆనెగొంది వద్ద వున్న నవ బృందావనం జయతీర్థులకు సుబేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. కర్ణాటక, ఆంధ్ర మధ్యన వుండే గిద్దెల సోమేశ్వరస్వామికి కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో కాళికాదేవి అమ్మవారికి కూడా ప్రత్యేక పూజలు జరిపారు. పూజల్లో పాల్గొన్న భక్తాదులకు కాళికాదేవి కమిటీ అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

అలరించిన నృత్యసంభ్రమ

బళ్లారి సిటీ, మార్చి 10: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి విరూపాక్ష దేవస్థానంలో ఏర్పాటు చేసిన శివమహాతత్వం నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. తుంగ-గంగా కళాట్రస్టు నృత్యసంగీత కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను తన్మయులను చేశాయి. ఈసందర్భంగా దేవస్థానం కమిటీ అధ్యక్షులు డా.ప్రసాద్, అర్చకుడు గోపినాథ్ శాస్త్రి కళాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు భక్తులు పాల్గొన్నారు.

హంపీలో బిడ్డకు పాలిచ్చేందుకు ప్రత్యేక గది ఏర్పాటు



పిల్లలకు పాలిచ్చేందుకు ఏర్పాటు చేసిన గది

కంప్లి, మార్చి 10: హంపీకి వచ్చే చిన్న పిల్లల తల్లులకు ప్రత్యేకంగా విఠలరాయ దేవస్థానం వద్ద ప్రత్యేక గదులను అధికారులు ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలకు తల్లులు పాలిచ్చేందుకు కొంతవరకు ఇబ్బందికరంగా వుండటంతో వారిని దృష్టిలో వుంచుకుని ప్రత్యేకంగా ఆలయాల వద్ద మండపాన్ని ఏర్పాటు చేశారు. ఇకపై హంపిని వీక్షించేందుకు వచ్చిన చిన్న పిల్లల తల్లులు ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని తెలిపారు.

రూ.10,600 పలికిన రథం జెండా



రథాన్ని లాగుతున్న ప్రజలు

- కమలాపురంలో ఘనంగా రథోత్సవం

హొసపేట, మార్చి10: రథోత్సవంలో రథానికి కట్టిన జెండాను వేలంవేయగా ఓ కుటుంబం దానిని రూ.10,600తో దాన్ని దక్కించుకుంది. జయనగరం జిల్లా హొసపేట తాలూకాలోని కమలాపూర్‌లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం అంగరంగ వైభవంగా ఈశ్వరుడి రథోత్సవ వేడుకలు జరిగాయి. మంగళ వాయిద్యాలతో వందలాది మంది చిన్నారులు రథాన్ని లాగడం ఇక్కడి ప్రత్యేకత. శనివారం సాయంత్రం రథోత్సవం ఆలయం నుంచి కేఈబీ సమీపంలోని బసవన్న కట్ట వరకు సాగి అక్కడి నుంచి తిరిగి యథావిధిగా ఆలయానికి చేరుకుంది. అప్పటికప్పుడు రథంపై కట్టిన జెండాను వేలంవేయగా మహంకాళప్ప కుటుంబం దాన్ని దక్కించుకుంది. ఈకార్యక్రమంలో యజమానులు మల్లే శప్ప, ముధుగుణిక వెంకటేష్, కడగప్ప, శేఖర్, బావిమల్లేశప్ప, హనుమంతప్ప, మున్సిపల్ కౌన్సిలర్లు గోపాలకృష్ణ, వీరేశ్ కొట్బాల,కన్నేశ్వర్,రవి కుమార్, హాలుగప్ప,శివరాం,ఆనంద్, మహంకాళి వెంకటేష్,చిదానంద తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో 21 గొర్రెల మృతి

బళ్లారి సిటీ, మార్చి 10: తాలూకాలోని సంజీవరాయనకోట గ్రామ పొలంలో ఉన్న గొర్రెల దొడ్డిపై ఆదివారం ఉదయం చిరుతలు దాడి చేసి 21గొర్రెలను చంపి ఒక గొర్రెను ఎత్తుకెళ్ళాయి. తిమ్మప్ప కుమారుడు మంజుకు చెందిన గొర్రెలను దొడ్డిలో ఉంచగా, ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. సంబంధించిన అధికారులు జనప్రతినిధులు పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంతంలో వేకువజామున, సాయం సమయంలో వాకింగ్ వచ్చేవారు హెచ్చరికతో ఉండాలని అటవీశాఖ సూచించింది.

షార్ట్ సర్క్యూట్‌తో కార్మికుడి మృతి

బళ్లారిరూరల్, మార్చి 10 : తాలుకాలోని కారేకల్ వీరాపుర గ్రామానికి చెందిన ముళ్ల వన్నూరుస్వామి కారేకల్ గ్రామంలో గోడకట్టే పనులు చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యాడు. దీంతో స్థానికులు వెంటనే అతనిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పీడీ హళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆనేగొంది ఉత్సవాలను పరిశీలించిన ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి

గంగావతి రూరల్, మార్చి 10: గంగావతి తాలూకా ఆనేగొందిలో రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల వేదికలను ఆదివారం ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి పరిశీలించారు. అలాగే ఆదివారం జరిగిన వికలాంగుల కబడ్డీపోటీలు, వివిధ క్రీడాపోటీలను ఎమ్మెల్యే తిలకించి మాట్లాడారు. సోమ, మంగళవారాల్లో జరుగు ఉత్సవాల్లో తాగునీటి సమస్య ఉండరాదని, ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ప్రజల సహకారం అవసరమన్నారు.

బావి తవ్వకాల్లో బయటపడిన బసవన్న విగ్రహం

కంప్లి, మార్చి 10: విజయనగర జిల్లా హరప్పనహళ్లి తాలుకా కమ్మత్తహళ్లి గ్రామంలో పురాతన బావి తవ్వుతుండగా శివలింగం, బసవన్నమూర్తులు బయపడ్డాయి. గత 500 సంవత్సరాల క్రితం బావి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పునబగట్టి గ్రామ పంచాయతీ అధికారులు ఉపాధి కూలీలతో బావి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ తవ్వకాలలో శివలింగం, బసవన్న విగ్రహాలు బయటపడ్డాయని అధికారులు తెలిపారు. బయటపడిన శివలింగాన్ని, బసవన్న మూర్తులను పురాతత్వ అధికారులకు అప్పగించారు.

మహిళలతోనే ప్రగతి సాధ్యం: గారపాటి రామకృష్ణ

బళ్లారి సిటీ, మార్చి 10: మహిళల తోనే అన్ని రంగాల్లో ప్రగతి సాధ్యపడుతుందని అఖిల కర్ణాటక కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ అన్నారు. ఆదివారం మాతా అన్న పూర్ణేశ్వరీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కోదండరామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విశ్వమహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి ఆదునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించి కీర్తిని అందుకోవడం శ్లాఘనీయమన్నారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని తెలిపారు. వివిధ రంగాల్లో సాధన చేసిన పది మంది మహిళలకు కిత్తూరురాణి చెన్నమ్మ పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణను ట్రస్టు సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రవచనకారుడు రవిచంద్ర, సూర్యనారాయణ, భాస్కర్ రావ్, రామబ్రహ్మం, రాజ్యలక్ష్మి, మంగమ్మ, రంగయ్య, రాజేశ్వరీ, అంజమ్మ, దుర్గా, ఝాన్సీ, సూర్యకుమారి, బుజ్జమ్మ, ప్రవీణ, కవిత, అనురాధ పాల్గొన్నారు.



వివిధ రంగాల్లో విజయం సాధించిన మహిళలను సన్మానిస్తున్న గారపాటి రామకృష్ణ

హోసూరు జోన్

తాగునీటి కేంద్రానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ సెల్లకుమార్

హోసూరు, మార్చి 10: హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ వార్డు కోట మారియమ్మ దేవాలయం సమీపంలో రూ.9.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న శుద్ధతాగునీటి కేంద్రానికి ఎంపీ సెల్లకుమార్ భూమిపూజ చేశారు. కృష్ణగిరి పార్లమెంట్ కాంగ్రెస్ సభ్యుడు డాక్టర్ సెల్లకుమార్ నియోజకవర్గ అభివృద్ధి నిధులను విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్, నగర అధ్యక్షుడు త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మణియమ్మ జయంతి

హోసూరు మార్చి 10: ద్రవిడ కళగం పార్టీ వ్యవస్థాపకులు, ఈరోడ్‌కు చెందిన ఈవే రామస్వామి భార్య మణియమ్మ 105వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెండు నిమిషాలపాటు మౌనం వహించారు. రామస్వామి చేసిన సమాజసేవను పలువురు ప్రస్తావించారు. కార్యక్రమంలో డీఎంకే ప్రాంతీయ కార్యదర్శి సభ్యుడు ఎల్లోరమణి, ఎంపీలు దేవిమాదేశ్, భాగ్యలక్ష్మి, కుప్పుస్వామి, టీఆర్‌డీ జిల్లా కార్యదర్శి విఘ్నేశ్, ద్రావిడ కళగం జిల్లా కార్యదర్శి చిన్నస్వామి, ద్రావిడ కళగం జిల్లా ఆర్గనైజర్లు సిద్ధంతన్, వాసు పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురి చేరిక

హోసూరు(మత్తిగిరి) మార్చి 10: హోసూరు సమీపంలోని బేగేపల్లిలో బీజేపీలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు చేరారు. హోసూరు యూనియన్ పరిధిలోని బేగేపల్లిలో యూనియన్ మాజీ అధ్యక్షుడు నారాయణమూర్తి ఆధ్వర్యంలో 250 మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజ్, జాతీయ జనరల్ కమిటీ సభ్యులు బాలకృష్ణ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. పార్టీ కండువాలతో అందరినీ ఆత్మయంగా స్వాగతించారు. జిల్లా బీజేపీ పాలనాధికారులు విజయకుమార్, శ్రీనివాసులు, మురుగన్, ప్రవీణ్‌కుమార్, జిల్లా జట్టు యూనిట్ నిర్వాహకులు ఓం, కరుణానిధితో పాటు పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పండుగ

హోసూరు(సిఫ్‌కాట్) మార్చి 10: హోసూరు సమీపంలోని ఆలసపల్లి గ్రామ పరిధిలోని బీ ముదుగానపల్లిలో ఆదివారం సాంప్రదాయ ఎద్దుల వేడుక జరిగింది. ఇందులో హోసూరు సర్క్యూట్ ప్రాంతాలైన శూలగిరి, బేరిక్టై, బాగలూరు, ఉద్దనపల్లి, రాయకోట, కెలమంగలం, డెంకణికోట, తళి, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక ఆంధ్రప్రదేశ్‌ల నుంచి 200కు పైగా ఎద్దులు పాల్గొన్నాయి. ఎద్దులకు కొమ్ములకు రంగు రంగుల బెలూన్‌లు కట్టి వివిధ రంగులతో అలంకరించి బరిలోకిఎద్దులను వదలారు. కొందరు యువకులు పోటీలో పాల్గొని ఎద్దులను లొంగదీసుకొన్నారు.అలా చేసిన యువకులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహక కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. బాగలూరు, బేరిక్టై పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవంలో పాల్గొన్న ప్రజలకు అన్నదానం చేశారు. 5 వేలకు పైగా ప్రజలు పాల్గొని వీక్షించారు.



పోటీల్లో పాల్గొన్న ఎద్దు

నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం: ఎస్పీ



పోలీసుల వాక్ థాన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ బి.నిఖిల్

రాయచూరు, మార్చి 10 : నేరాలను నియంత్రించడంలో ప్రజల సహకారం అవసరమని రాయచూరు జిల్లా ఎస్పీ బి.నిఖిల్ అన్నారు. నేరాల నుంచి సమాజాన్ని విముక్తి చేయడంతో పాటు వ్యసనాల బారిన పడకుండా రక్షించే బాధ్యత పోలీసులదేనన్నారు. ఈ క్రమంలో పోలీసులు చేస్తున్న కృషికి ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. రాష్ట్ర స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆదివారం పోలీస్ వాక్ థాన్ నిర్వహించారు. ఈ అవగాహన జాతాను పరేడ్ మైదానం వద్ద ఎస్పీ బి.నిఖిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన నేరాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోలీసులకు అందించడం ద్వారా తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలన్నారు. పోలీస్ వాక్ జాతా స్థానిక మహాత్మాగాంధీ స్టేడియం వరకు సాగింది.

గణేకల్ జలాశయాన్ని పరిశీలించిన సిటీ ఎమ్మెల్యే

రాయచూరు, మార్చి 10 : నగరానికి తాగునీరందించే గణేకల్ జలాశయాన్ని ఆదివారం సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ పరిశీలించారు. తుంగభద్ర నది నుంచి ప్రతి రోజు ప్రత్యేకంగా నీటిని విడుదల చేస్తూ గణేకల్ జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు కృష్ణ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతున్నా వైటీపీఎస్ విద్యుత్ కేంద్రానికి నీటి అవసరం ఉండడంతో అక్కడ నుంచి అనుకున్నంత స్థాయిలో నీరందడం లేదని అధికారులు వివరించారు. కాగా 10 రోజుల్లో గణేకల్ జలాశయాన్ని పూర్తిస్థాయిలో నీటితో నింపాలని అధికారులను సిటీ ఎమ్మెల్యే ఆదేశించారు. జలాశయానికి నీటి లభ్యత లేకపోతే ప్రత్యేకంగా తుంగభద్ర నది నుంచి నీటి విడుదలకు ఇరిగేషన్ శాఖ అధికారులతో సంప్రదించాలన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నగరానికి ప్రధాన తాగునీటి వనరుగా ఉన్న ఈ జలాశయాన్ని 10 రోజుల్లోగా నింపాలని లేదంటే తాము తప్పనిసరిగా ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మీ పల్లెకు రండి.. టీడీపీని గెలిపించండి

- పరుచూరు అభ్యర్థి ఏలూరి సాంబశివరావు


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అభిమానులు తదితరులు

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మీ పల్లెకు రండి... విధ్వంసం దిశగా సాగిన ఐదేళ్ల పాలనకు అంతిమం పలకాలని ప్రకాశం జిల్లా పరుచూరు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం మహదేవపురలోని ఎస్‌కేజీ కల్యాణమండపంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం, జనసేన అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ రాజకీయాలంటే కక్ష సాధింపు లక్ష్యం అనేలా ఏపీలో కొనసాగుతోందన్నారు. 10 రూపాయలు చేతికిచ్చి వంద రూపాయలు లాగేసుకుంటున్నారన్నారు. ప్రతిచోటా అవినీతి, అధికారదర్పం కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం లేదన్నారు. ప్రతిచోటా దౌర్జన్యాలు తీవ్రమయ్యాయన్నారు. వైసీపీ నేతలు నిత్యం అబద్ధాలనే ప్రచారం చేస్తున్నారన్నారు. స్వయానా ముఖ్యమంత్రి జగన్ నోట అబద్ధాలు ఊడిపడుతున్నాయన్నారు. ఐదేళ్లక్రితం ఎన్నికల వేళ మద్యపాన నిషేధం, జాబ్ క్యాలెండర్‌తోపాటు ఎన్నో హామీలు ఇచ్చారని అధికారంలోకి వచ్చాక ఒక్కటీ నెరవేర్చ లేదన్నారు. మద్యపానం నిషేధించకుంటే ఓట్లు అడిగేది లేదని చెప్పారని కానీ అన్నీ కల్తీ సొంత బ్రాండ్‌లతో సామాన్యులను రోగులను చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రగతిని ఆకాంక్షించారన్నారు. ఆయన దశాబ్దాల రాజకీయంలో విధ్వంసాలు, హింస, అవినీతికి ఎక్కడా అవకాశం ఇవ్వలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వనరులు పెంపొందించే దిశగా పాటుపడ్డారన్నారు. ఒక్క అవకాశం అంటూ ఆంధ్రప్రదేశ్‌ను నిట్ట నిలువునా వైసీపీ ముంచేసిందన్నారు. అసలు ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సొంతంగా ప్రచారం చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం అక్కడ నివసించేవారితో మాత్రమే కాదని బెంగళూరుతోపాటు దేశవ్యాప్తంగా ఉండే ప్రవాసాంధ్రులందరిపైనా ఉందన్నారు. బెంగళూరులో వ్యాపారం, ఉద్యోగాలు తదితర సొంత వ్యవహారాలకోసం వచ్చి స్థిరపడినవారంతా ఎన్నికల వేళ స్వగ్రామాలకు రావాలని పిలుపునిచ్చారు. కేవలం పోలింగ్ రోజున అలా వస్తే సాధ్యం కాదని, నాలుగురోజులు ముందుగా వచ్చి మీతోపాటు బంధుమిత్రులందరి చేత ప్రజాస్వామ్య పరిరక్షణకోసం ఆంధ్రప్రదేశ్ ప్రగతి కోసం మద్దతు ఇవ్వాలన్నారు. జన సేనతో తెలుగుదేశం కలవడమే ఆంధ్రప్రదేశ్‌లో అరాచ కాలను స్వస్తి పలికించడానికన్నారు. బీజేపీతోనూ పొత్తు ఏర్పడటం మరింత కలసి వచ్చినట్లేనన్నారు. బెంగళూరు టీడీపీ ఫోరం ఒక వ్యవస్థ కాకుండా శక్తివంతమైన సంఘంగా పని చేస్తోందని కొనియాడారు. టీడీపీ ఫోరం వ్యవస్థాపకులు కనకమేడల వీర మాట్లాడుతూ తెలుగు వారమంతా ఒక్కటి కావాల్సిన తరుణం వచ్చేసిందన్నారు. మరికొన్ని రోజుల్లోనే ఎన్నికలు వస్తున్నాయని బెంగళూరులో నివసించేవారంతా సొంతూళ్లకు వెళ్దామన్నారు. నియోజకవర్గాల వారీగా ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారో ఫోరం ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని పిలుపు నిచ్చారు. ఏలూరి సాంబశివరావు యువకుడు, ఉత్సాహవంతుడని, ఆయన మార్గదర్శకంలో ముందుకెళ్దామన్నారు. 2014లో తొలిసారి గెలిచారని,


ప్రసంగిస్తున్న సాంబశివరావు

2019లో ఎంతో క్లిష్టమైన సమయంలోనూ విజయం నమోదు చేశారన్నారు. ఆయన హ్యాట్రిక్ కోసం ప్రయత్నిద్దామన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి సందేహాలు ఉన్నా టీటీఎఫ్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. చంద్రబాబు నాయుడు విజన్ ద్వారా ఐటీ ఉద్యోగాలు సాధించిన మనమంతా రాష్ట్రంకోసం ముందుకెళ్దామన్నారు. కార్యక్రమంలో పరుచూరు నియోజక వర్గానికి చెందిన కొమ్మి మహేశ్, శ్రీధర్, మణి బాబు, రామకృష్ణ, ప్రవీణ్, రాజశేఖర్, ప్రమోద్, అజయ్‌లతోపాటు టీటీఎఫ్ ప్రతినిధులు శ్రీనివాస్, సురేశ్, లక్ష్మణ్, మధు, మహేంద్ర, వెంకటేశ్, రామకృష్ణ, హరి, నారాయణ, బిందు, చైతన్య, కాలేష, ఆలిండియా కమ్మ యూత్ ఫెడరేషన్ బెంగళూరు మాజీ కార్యదర్శి కే రమేశ్ బాబు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఏలూరి సాంబ శివరావు క్లాస్‌మేట్స్ తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం జిల్లా ప్రజలతో అభ్యర్థి ఏలూరి సాంబశివరావు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

కృష్ణన్ నాయర్ (జయంతి)



కథాకళి నృత్యానికి వన్నె తెచ్చిన 'పద్మశ్రీ' గ్రహీత కళామండలం కృష్ణన్ నాయర్ 1914 మార్చి 11న కేరళ రాష్ట్రం కన్నూర్ ప్రాంతంలో జన్మించారు. ప్రత్యేకించి రస-అభినయలో పేరొందారు. నలన్, భీమన్, అర్జునన్, రుక్మాంగదన్, కర్ణన్ పాత్రల్లో పేరొందారు. మోహినీయాట్టం కళాకారిణి కళ్యాణికుట్టిని వివాహం చేసుకున్నారు. సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు పొందారు. 1990 ఆగస్టు 15న కన్నుమూశారు.

విజయ్ హజారే (జయంతి)



ప్రముఖ క్రికెటర్ 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత విజయ్ శామ్యుయేల్ హజారే 1915 మార్చి 11న మహారాష్ట్ర రాష్ట్రంలోని సాంగ్లిలో జన్మించారు. క్రికెట్‌లో 1951-53 మధ్య భారత జట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రెండుసార్లు త్రిపుల్ సెంచరీ చేసిన తొలి ఇండియన్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందారు. 60 ఫస్ట్‌క్లాస్ సెంచరీలు చేశారు. రిటైర్మెంట్ తర్వాత టెస్ట్ క్రికెట్ సెలెక్టర్‌గా వ్యవహరించారు. ఆయన గౌరవార్థం దేశంలో జోనల్ టోర్నీలో 'విజయ్ హజారే ట్రోఫీ' ప్రవేశపెట్టారు. 2004 డిసెంబరు 8న కన్నుమూశారు.

మాధవపెద్ది సత్యం (జయంతి)



మాధవపెద్ది సత్యం 1922 మార్చి 11న గుంటూరు జిల్లా బాపట్లలో జన్మించారు. తెలుగు నాటక కళాకారుడు, నేపథ్య గాయకుడు. 1946లో 'రామదాసు' తమిళ, హిందీ ద్విభాషా చిత్రంతో నటుడిగా, గాయకుడిగా అరంగేట్రం చేశారు. ప్రత్యేకించి ఎస్వీ రంగా రావు, రేలంగి, రమణారెడ్డిల గొంతుకు అనుగుణంగా పాటలు పాడారు. 'మాయాబజార్'లోని 'వివాహ భోజనంబు', 'కులగోత్రాలు'లోని 'అయ్యయ్యో జేబులో డబ్బులు పోయెనె' వంటి పాటలు ఎంతో పేరొందాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సింహళ భాషలతో సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7వేలకు పైగా పాటలు పాడారు. 2000 డిసెంబరు 18న కన్నుమూశారు.

డాక్టర్ వి. శాంతా (జయంతి)



ప్రముఖ డాక్టర్ వి. శాంతా 1927 మార్చి 11న మద్రాస్‌లో జన్మించారు. ఆంకాలజిస్ట్‌గా, అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ప్రతి వ్యక్తికి వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్న ఆదర్శం, సాటి వ్యక్తికి మేలు చేయాలన్న లక్ష్యంతో సాగారు. జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య కమిటీలలో సభ్యురాలిగా వ్యవహరించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, రామన్ మెగసెసె అవార్డులు లభించాయి. 2021 జనవరి 19న కన్నుమూశారు.

పాల ఉత్పత్తిదారుల కౌన్సిల్ రాష్ట్రసంచాలకుడిగా లోకేశ్‌గౌడ


లోకేశ్‌గౌడ

శిడ్లఘట్ట, మార్చి 10: పాల ఉత్పత్తిదారుల కౌన్సిల్ రాష్ట్ర సంచాలకులుగా సీవీ లోకేశ్ గౌడ నియమితులయ్యారు. శిడ్లఘట్ట తాలూకా బళువనహళ్ళికి చెందిన లోకేశ్‌గౌడను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర అవకాశం కల్పించారు. కాగా బీజేపీ రాష్ట్ర పట్టురైతుల కౌన్సిల్ సంచాలకులుగా లోకేశ్‌గౌడ గతంలో వ్యవహరించారు. ముధోళ, అఫ్జల్‌పుర, నెలమంగల శాసనసభ నియోజకవర్గాలకు బీజేపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. గొర్రెల పెంపకందారుల సహకార సంఘం, రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఒక చిన్న గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన లోకేశ్‌గౌడ ప్రస్తుతం తాలూకా, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందగా తాజాగా రాష్ట్రస్థాయిలో అవకాశం దక్కించుకున్నారు.

కాళికాంబ కమటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కాళికాంబ కమటేశ్వరస్వామి

రొళ్ల, మార్చి 10: మండలంలోని రత్నగిరిలో వెలసిన కాళికాంబ కమటేశ్వరస్వామికి మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేయించారు.

కొల్హాపురమ్మను దర్శించుకున్న పరిపూర్ణానందస్వామి

రొళ్ల, మార్చి 10: కాకినాడ శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామీజీ ఆదివారం మండలంలో పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు జరిపించారు. అనంతరం సీఎం గట్టకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడి తోటలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బెంగళూరులో నీటి సరఫరాలో వ్యత్యాసం లేదు

» జలమండలి ఛైర్మన్ రామప్రసాద్ మనోహర్


రామప్రసాద్ మనోహర్

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర వ్యాప్తంగా నీటి సరఫరాలో వ్యత్యాసం కాలేదని, ప్రజలు తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని జలమండలి ఛైర్మన్ రామప్రసాద్ మనోహర్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడుతూ జలమండలి పరిధిలో 1470 ఎంఎల్‌డీల కావేరి నీటిని నిత్యం సరఫరా చేస్తున్నామన్నారు. సరఫరాలో ఎక్కడా వ్యత్యాసం కాలేదన్నారు. బెంగళూరుకు వచ్చేనీరు యథావిధిగా అందుతోందన్నారు. బెంగళూరు నగరానికి నెలకు 1.54 టీఎంసీల నీరు అవసరం ఉందన్నారు. మార్చి నుంచి జూలై దాకా 8 టీఎంసీలు అవసరం కానున్నాయన్నారు. బెంగళూరుతోపాటు అన్ని ప్రాంతాలకు జూలై చివరివరకు 17 టీఎంసీల నీరు అవసరం ఉంటుందన్నారు. కావేరి జలాశయాలలో 34 టీఎంసీల నీరు ఉందన్నారు. అవసరానికంటే రెండింతల నీరు ఉందన్నారు. ఎలాంటి ఆందోళన వద్దన్నారు. నీటిని సజావుగా సరఫరా చేసేందుకు కట్టుబడ్డామన్నారు.

కావేరి నుంచి 1450 ఎంఎల్‌డీలు

బెంగళూరులో 1.40 కోట్లమంది జనాభా ఉన్నారని రోజూ 2100 ఎంఎల్‌డీల నీరు అవసరం కానుందన్నారు. (ఒక మనిషికి రోజుకు సగటున 150 లీటర్ల నీరు) 1450 ఎంఎల్‌డీల నీరు కావేరి నుంచి ప్రతిరోజూ సరఫరా అవుతోంది. వాటిని సమగ్రంగా పంపిణీ అమలులో ఉంది. బెంగళూరు శివారులోని 110 పల్లెల్లో భూగర్భజలం అడుగంటడంతో 650 ఎంఎల్‌డీల నీటి సమస్య ఏర్పడింది. భూగర్భజలమట్టం తగ్గేందుకు అందరూ కారకులే అన్నారు. నగర శివారులో అపార్ట్‌మెంట్‌లు వెలిశాయని వీరు కావేరి నీటిపై ఆధారపడలేదన్నారు. ఎక్కువమంది బోర్‌వెల్ ద్వారానే వాడుతున్నారన్నారు. ప్రస్తుతం భూగర్భజలం అడుగంటడంతో సమస్య నెలకొందన్నారు. బోర్‌వెల్స్ ద్వారా ఆధారపడినవారి సమస్య పరిష్కరించేందుకు జలమండలి అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో సొంతబోర్లు వాడుకునేవారిదీ ఇదే సమస్య అయ్యిందన్నారు. బెంగళూరులో భూగర్భజలమట్టాన్ని పెంచేదిశగా జలమండలి 1300 ఎంఎల్‌డీల సంస్కరించిన నాణ్యమైన నీటిని నగర పరిధిలోని ఎండిపోయిన చెరువులు నింపేందుకు సిద్ధమైందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నిపుణుల సహకారంతో ఈ ప్రాజెక్ట్ చేశామన్నారు. వీటిలో నాయండహళ్ళి చెరువు, చిక్కబాణవార, నాగవార, వర్తూరు, అగర చెరువులతోపాటు నీరు లేక ఎండిపోయిన చెరువులను భర్తీ చేయదలిచామన్నారు. వీటి ద్వారా సమీపంలోని లే అవుట్‌లకు అనుకూలం కానుందన్నారు. చెరువుల సమీపంలోనే ఫిల్టర్‌బోర్‌లను ఏర్పాటు చేశామని, వాటర్ ప్లాంట్‌లు అమర్చేందుకు తగిన నీటి నాణ్యతను పరిశీలిస్తున్నామన్నారు. దేవనహళ్ళి కోట వద్ద చెరువునీటిని ఇదే తరహాలో సంస్కరించి నగరానికి సరఫరా చేస్తున్నామన్నారు. 582 ప్రాంతాల్లో సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేశామని, మురికివాడలు, జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, హెచ్చుతగ్గులు ఉండే ప్రాంతాల్లోనూ 1000 - 3000 లీటర్ల సామర్థ్యం కల్గిన ట్యాంకులను జలమండలి ద్వారా ఏర్పాటు చేశామన్నారు. రోజుకు రెండుసార్లు నీటిని ట్యాంకర్ల ద్వారా సింటెక్స్‌లను భర్తీ చేస్తామన్నారు. డిమాండ్‌నుబట్టి మరిన్నిసార్లు భర్తీ చేసేందుకు సిద్ధమన్నారు. ఈ ప్రాంత ప్రజలు ట్యాంకుల ద్వారా ఉచితంగా తాగునీటిని పొందవచ్చునన్నారు. సంస్కరించిన నీటిని ఇతర ప్రయోజనాలకు వాడేలా సూచించామన్నారు. కావేరి ఐదో విడత పనులు వేగవంతంగా సాగుతున్నాయని, మే 15 నాటికి పూర్తి కానున్నాయన్నారు. ఆ తర్వాత 110 గ్రామాలకు కావేరినీరు సరఫరా చేస్తామన్నారు. సమస్య తలెత్తిన 110 గ్రామాల పరిధిలో 6వేల లీటర్ల సామర్థ్యం కల్గిన 79 ట్యాంకర్లను బీబీఎంపీ స్వాధీనం చేసుకుందని, వాటిద్వారా సరఫరా చేయదలిచామన్నారు.

బోరు వేయాలంటే అనుమతి ఉండాల్సిందే

బెంగళూరు నగర వ్యాప్తంగా బోరుబావులు తవ్వాలంటే జలమండలి అనుమతులు తప్పనిసరి చేశారు. భూగర్భజలాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోకపోవడంతోపాటు ప్రజల భవిష్యత్తు దృష్ట్యా నిర్ణయాలు తీసుకున్నట్టు ఛైర్మన్ రామప్రసాద్ మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా జలమండలి సాంకేతిక కమిటీ సభ్యుడు, ఐఐఎస్‌సీ నిపుణుడు ప్రొఫెసర్ విశ్వనాథ్, చీఫ్ ఇంజనీర్ జయప్రకాశ్‌లు ఉన్నారు.

బోరులో రాళ్లు వేసినవారిపై చర్యలు తీసుకోండి


బోరు దుస్థితిని వివరిస్తున్న గ్రామస్థులు

బంగారపేట, మార్చి 10: జలజీవన్ మిషన్ పథకం కింద ఇటీవల తవ్విన బోరుబావిలో కొందరు దుండగులు రాళ్లు వేశారని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు మంజునాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాలూకాలోని కెసరనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే మరవహళ్ళిలో వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి నివారణకై ఎమ్మెల్యే నారాయణస్వామితో చర్చించగా గ్రామానికి బోరు మంజూరు చేశారన్నారు. అయితే కొంతమంది దుండగులు శుక్రవారం మూసిన బోరుబావి పైప్‌లైన్‌ను కట్ చేసి రాళ్లు వేశారన్నారు. ఇలా వ్యవహరించినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్థుడు కుమార్ మాట్లాడుతూ రోజు రోజుకు ఎండలు పెరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. గ్రామంలో ఇటీవల తవ్వించిన బోరులో కొంతమంది రాళ్లు వేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. ఇలా వ్యవహరించినవారిని కఠినంగా శిక్షించాలన్నారు. గ్రామస్థులు లక్ష్మీనారాయణ, రామచంద్రప్ప, చలపతి, తరుణ్, మను, అమరేశ్, ఉమేశ్, నారాయణస్వామి, రాజేశ్, మంజునాథ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యరహళ్లి డెయిరీ సంఘం అధ్యక్షుడిగా రఘునాథ్

శిడ్లఘట్ట, మార్చి 10: శిడ్లఘట్ట తాలూకా యరహళ్ళి గ్రామంలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో జేడీఎస్ మద్దతు దారుడైన రఘునాథ్ అధ్యక్షుడిగా, గంగరత్నమ్మ ఉపాధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన డైరెక్టర్ లుగా వైకే మంజునాథ్, నారాయణస్వామి, యర్రమ్మ, రామరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాస్ వైఎం వెంకటేశ్‌లు ఎన్నికయ్యారు. డెయిరీ పదాధికారులంతా కలసి ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తమ విజయానికి సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పాలడైయిరీ అభివృద్ధికి పాటు పడాలని అధ్యక్షులకు సూచించారు. ఈ సందర్భంగా జేడీఎస్ ప్రముఖులు శివకుమార్, భావరెడ్డి, కోచిముల్ మాజీ డైరెక్టర్ బంకు మునియప్ప, ద్యావప్ప, వైబీ ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రవికుమార్‌తో పాలసంఘం పదాధికారులు

క్యాన్సర్ పట్ల మహిళల్లో చైతన్యం రావాలి

» మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి తదితరులు


బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పట్ల మహిళల్లో చైతన్యం రావాలని మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి అభిప్రాయపడ్డారు. గ్లెనిగల్ బీజీఎస్ ఆసుపత్రిలో టెల్ టు హీల్ టు గెదర్ పేరిట నెలరోజులపాటు మహిళా ఆరోగ్య ఉత్సవ్ ఆదివారం ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి క్యాన్సర్ విభాగం ముఖ్యులు డాక్టర్ జే మాతంగితోపాటు సీఓఓ బిజునాయర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్యరెడ్డి మాట్లాడుతూ మహిళల్లో క్యాన్సర్ సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు. ఆరంభదశలోనే గుర్తిస్తే నయం చేసుకోవచ్చునన్నారు. డాక్టర్ మాతంగి మాట్లాడుతూ జనవరి 24న ఆరోగ్య ఉత్సవ్‌కు శ్రీకారం చుట్టామన్నారు. కేన్సర్‌ను గుర్తించేందుకు విద్యాసంస్థలు, కార్పొరేట్ కార్యాలయాలు, సముదాయ కేంద్రాలలో ఆరోగ్యశిబిరాలతోపాటు అవగాహనా సదస్సులు జరిపామన్నారు. లక్షలాదిమందికి కేన్సర్‌పట్ల అవగాహన కల్పించామని 1200మంది మహిళలకు పాప్‌స్మియర్, మమ్మోగ్రఫీ పరీక్షలు చేశామన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌ను నియంత్రించే దిశగా చైతన్యం కలిగించామన్నారు. శిబిరాలకు వెళ్లినప్పుడు మహిళలు తమ సమస్యలను చెప్పుకోవడం చూస్తే ప్రజల్లో చైతన్యం మరింత పెరగాలని అనిపించిందన్నారు. బిజు నాయర్ మాట్లాడుతూ సమాజానికి తమవంతు సేవ చేయాలనే శిబిరాలు జరిపామన్నారు.

మారుతినగర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

బొమ్మనహళ్ళి, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మడివాళ మారుతినగర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ హెల్ప్‌లైన్ సంఘం అధ్యక్షుడు ఎస్‌ఎం థామస్ ఆధ్వర్యంలో శిబిరం సాగింది. మంత్రి రామలింగారెడ్డి భార్య చాముండేశ్వరి, స్థానిక నేత మాజీ మేయర్ మంజునాథరెడ్డిలు జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్‌తోపాటు ప్రత్యేకించి మహిళలు ఎదుర్కొంటున్న రొమ్ము కేన్సర్, తదితర సమస్యలపై పరీక్షలు చేశారు. లైఫ్‌కేర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని పరీక్షలు చేశారు. పౌరకార్మికులు తదితరులు 120మందికి పైగా శిబిరం ప్రయోజనం పొందారు. ఇదే సందర్భంగా రక్తదాన శిబిరంలో 42 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4వరకు శిబిరం కొనసాగింది. మంత్రి రామలింగారెడ్డి సహకారంతో నెలపొడవునా బీటీఎం లే అవుట్, జయనగర్ నియోజకవర్గాల్లో శిబిరాలు కొనసాగుతాయని నిర్వాహకులు థామస్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంజునాథ్, కవితా శ్రీనివాస్, నిషా, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


శిబిరం ప్రారంభంలో ప్రముఖులు

'ఆఫ్టర్ ఎఫెక్ట్స్'కు ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఫిల్మ్‌మేకర్ వినోద్ రాజేంద్ర

బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 8వ ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెంగళూరుకు చెందిన డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ వినోద్ రాజేంద్ర రూపొందించిన ఆఫ్టర్ ఎఫెక్ట్స్‌కు బెస్ట్ ఫిల్మ్ అవార్డు దక్కింది. రైళ్లపై ఆకతాయిలు రాళ్లు రువ్వే ఉదంతాల నేపథ్యంలో ఆఫ్టర్ ఎఫెక్ట్స్ తెరకెక్కింది. నైరుతి రైల్వే డివిజన్ పరిధిలో రైళ్ల భద్రతలో భాగంగా ది ఫస్ట్ జర్నీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆరు డాక్యుమెంటరీలు రూపొందించారు. ఇందులో ఆఫ్టర్ ఎఫెక్ట్స్‌కు ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆదివారం అవార్డు అందుకున్నారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ సీఎస్ఆర్ సహకారంతో ప్రాజెక్టు నిర్మించారు. 18దేశాల సినిమాలు ప్రదర్శించబడిన చిత్రోత్సవంలో అవార్డు గెలుచుకోవడం సంతోషంగా ఉందని వినోద్ తెలిపారు.

కార్కళ శ్రద్ధకు యూట్యూబర్ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న శ్రద్ధాజైన్


బెంగళూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉడుపి జిల్లా కార్కళ తాలూకా భజగోళికి చెందిన అయ్యో శ్రద్ధ యూట్యూబ్ చానెల్ నిర్వాహకురాలు శ్రద్ధాజైన్‌కు మహిళా విభాగం సృజనశీల పురస్కారం దక్కింది. రేడియో జాకి, కంటెంట్ క్రియేటర్ అయిన శ్రద్ధాజైన్‌కు ఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ క్రియేటివ్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆదివారం శ్రద్ధాజైన్ ఉడుపిలో మీడియాతో మాట్లాడుతూ భారతీయులకు నవ్వు ఒక కళ అని, అదే మార్గంలో చానెల్ కొనసాగిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి వేదికపైకి స్వాగతించే వేళ అయ్యో అంటూ ఆహ్వానించడం నాకు ప్రత్యేకం అనిపించిందన్నారు.

ప్రిన్సిపాల్ వెంకటశివారెడ్డికి పౌరసన్మానం


ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న వివిధ సంఘాల ప్రముఖులు

బాగేపల్లి, మార్చి 10: భౌతికశాస్త్రంలో పరిశోధనలకు పీహెచ్‌డీ పొందిన బాగేపల్లి నేషనల్ పీయూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ వెంకటశివారెడ్డిని కర్ణాటక సౌహార్ద వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పౌరసన్మానం జరిగింది. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రముఖులు పాల్గొని అభినందించారు. సీనియర్ న్యాయవాది ఏజీ సుధాకర్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో డాక్టరేట్ అనేది అమ్మకపు వస్తువుగా మారిందని, అనర్హులకు ఇవ్వడం వల్ల దాని గొప్పదనం తగ్గిందన్నారు. కనీస విద్యార్హత లేనివారికి, కన్నడలో వారి పేరు రాయడానికి కూడా రానివారికి కొన్ని యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం సిగ్గుపడే అంశమన్నారు. నిజమైన పరిశోధకులు, సాధకులకు డాక్టరేట్ వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ వెంకటశివారెడ్డి కఠినమైన భౌతికశాస్త్రంలో పరిశోధనలతో పీహెచ్‌డీ పొందడం ద్వారా యువతకు మాదిరిగా నిలిచారన్నారు. ఆ సందర్భంగా వెంకటశివారెడ్డి మాట్లాడుతూ తనకు పరిశోధనలకు అవకాశం కల్పించి పీహెచ్‌డీ పొందేందుకు వీలు కల్పించిన నేషనల్ కళాశాల పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధనలో మార్గదర్శకం చేసిన అందరి సహకారం మరువలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప, తాలూకా కార్యదర్శి ఎంఎన్ రఘురామరెడ్డి, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డీఎన్ కృష్ణారెడ్డి, గౌరవ కార్యదర్శి శ్రీనివాస్ బాణాలపల్లి, చన్నరాయప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

మాజీ ఐఏఎస్ అధికారి శివరాంకు శ్రద్ధాంజలి


ఛలవాది మహాసభ నేతృత్వంలో శివరాంకు శ్రద్ధాంజలి

బాగేపల్లి, మార్చి 10: రిటైర్డు ఐఏఎస్ అధికారి, నటుడు కే శివరాం మృతి పట్ల ఛలవాది మహాసభ తాలూకా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణంలోని గూళూరు సర్కిల్‌లో శివరాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. డీఎస్ఎస్ నాయకుడు మూర్తి మాట్లాడుతూ అపురూపమైన వ్యక్తిత్వం కల్గిన అధికారిగా శివరాం గుర్తింపు పొందారని, అన్ని వర్గాల్లోకి ప్రత్యేకించి వెనుకబడిన వర్గాల ఉన్నతికి కృషి చేశారన్నారు. శివరాం మృతి ఛలవాది సమాజానికి తీరనినష్టమన్నారు. ఛలవాది సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా కన్నడలో ఐఏఎస్ ఉత్తీర్ణులైన అధికారిగా, సాంఘిక సంక్షేమశాఖ కమిషనర్‌గా శివరాం సేవలు ప్రశంసనీయమన్నారు. సినీ నటుడిగా, రాజకీయాల్లోనూ రాణించారన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఈశ్వరప్ప, రమేశ్, రామాంజి, శ్రీనివాస్, కేఎన్ కొండారెడ్డి, నరసింహప్ప, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బాగేపల్లి, మార్చి 10: వేగంగా వెళ్తున్న ఇన్నోవా కారు, ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణ శివారులోని దాబా ముందు జాతీయ రహదారి 44పై ఆదివారం వేకువజామున ప్రమాదం చోటు చేసుకుంది. బాగేపల్లి తాలూకా బిళ్ళూరుకు చెందిన రెడ్డెప్పచారి (36) తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదమైన వెంటనే కారు డ్రైవర్ అక్కడనుంచి పారిపోయాడు. కాగా సదరు కారు పురసభ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌కు చెందినట్టుగా తెలుస్తోంది. క్షతగాత్రుడిని బెంగళూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాగేపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.